# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

### ముఖ్యాంశాలు

- జనగణన ప్రక్రియలో ప్రజలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.
- మహిళా అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని నంద్యాల ఎంపీ శబరి అన్నారు.
- మహిళలకు నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కల్పించడం మరింత అభ్యున్నతికి దారి తీస్తుందని కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ చెప్పారు.
- రోడ్డు ప్రమాద భాదితులకు పీఎం-రాహత్ పథకం కింద లక్ష 50 వేల రూపాయాల ఉచిత నగదు రహిత వైద్య సేవలు అందిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

====================

జనగణన-2027లో భాగంగా హౌస్ లిస్టింగ్- హౌస్ సెన్సెస్ కార్యక్రమం రాష్ట్రంలో ఈరోజు ప్రారంభమయ్యింది. ఈ నెల 30వ తేదీ వరకూ ప్రజలు స్వయంగా ఆన్ లైన్ లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామని రాష్ట్ర జనగణన కార్యకలాపాల సంచాలకులు జె.నివాస్ తెలిపారు. ఈరోజు ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిశారు. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ముఖ్యమంత్రికి ఆయన వివరించారు. మే 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ ఎన్యుమరేటర్ అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియను చేపడతారని తెలియజేశారు. అనంతరం ముఖ్యమంత్రి తన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో పౌరులందరికీ సమానంగా సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. దీని కోసం కుటుంబాన్ని ఒక యూనిట్ గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికలను రూపొందించటం అవసరమని, ఈ లక్ష్య సాధనలో జనగణన కార్యక్రమం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ లో జనగణన కార్యక్రమం జరుగుతోందని ఇది కేవలం సమాచార సేకరణ మాత్రమే కాకుండా అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. జనగణన ప్రక్రియలో ప్రజలు భాగస్వాములు కావాలని నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

====================

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో భాగంగా లోక్‌సభలో ఈరోజు మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించి 131వ రాజ్యాంగ చట్ట సవరణ బిల్లును కేంద్ర న్యాయశాఖా మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చేపట్టిన చర్చలో పలు పార్టీలకు చెందిన సభ్యులు మాట్లాడారు. మహిళల సాధ్యంలోని అభివృద్ధికి ఈ బిల్లు అవకాశం కల్పిస్తుందని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. మహిళలకు ఉద్యోగాల్లో 30శాతం రిజర్వేషన్లు ప్రకటించిన మొదటి పార్టీ తెలుగుదేశం అని గుర్తు చేశారు. మహిళలకు ఆస్తిలో వాటా కల్పించడం, తిరుపతిలో మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడం, మహిళల కోసం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడం లాంటి చర్యలు తమ పార్టీ హయాంలోనే జరిగాయని చెప్పారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించామని, లక్షల మంది మహిళా ఎంట్రప్రెన్యూర్‌లను తయారుచేశామని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరుతోనే అమలు చేస్తున్నామని చెప్పారు. మహిళా అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపి శబరి పేర్కొంటూ...

(వాయిస్…27 సెకన్లు)

====================

మహిళలకు నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కల్పించడం మరింత అభ్యున్నతికి దారితీస్తుందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఈరోజు ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ.. మహిళా సాధికారత సాధించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో మహిళా రిజర్వేషన్ల బిల్లు పార్లమెంట్ లో ప్రవేశపెట్టామని చెప్పారు. దేశవ్యాప్తంగా మహిళలు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్న ఈ బిల్లు ఆమోదం పొందుతుందని భావిస్తున్నానని, అన్ని పార్టీలు కూడా బిల్లు ఆమోదానికి సహకరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేసారు.

(వాయిస్…28 సెకన్లు)

====================

విరామం

====================

రోడ్డు ప్రమాదాల నిరోధానికి ప్రభుత్వ శాఖలు, పౌరులు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ముఖ్యంగా రవాణా, పోలీసు శాఖలు రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అవసరమైన చోట్ల ముందు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో 'పీఎం-రాహత్' పథకం అమలుపై ప్రభుత్వ శాఖల సమన్వయ సమావేశం ఈరోజు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలకు గురైన బాధితులకు తక్షణ వైద్య చికిత్స అందించేందుకు ఉద్దేశించిన పీఎం రాహత్ పథకాన్ని ఎన్టీఆర్ వైద్యసేవ పథకంతో అనుసంధానం చేసినట్లు చెప్పారు. ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రమాదం జరిగిన గంటలోగా లక్షా 50 వేల రూపాయల విలువైన నగదు రహిత వైద్య చికిత్సను అందిస్తారని తెలిపారు. ఒకవేళ అర్హత కలిగిన వారిలో ఎవరికైనా వైద్యాన్ని అందించేందుకు లక్షా 50 వేల రూపాయలు చాలని పక్షంలో.. మిగిలిన మొత్తాన్ని ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు కింద భరిస్తామని పేర్కొన్నారు. పీఎం రాహత్ పథకం క్షతగాత్రులకు తక్షణ ఉపశమనం అందిస్తుందని మంత్రి వివరిస్తూ…

(వాయిస్…30 సెకన్లు)

====================

ఉత్తర కోస్తా జిల్లాల పరిధిలో పంటల ఉత్పత్తి గణనీయంగా పెంచేందుకు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ పాలడుగు వెంకట సత్యనారాయణ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఉత్తర కోస్తా మండల వ్యవసాయ పరిశోధన.. విస్తరణ సలహా మండలి సమావేశంలో ఆయన ఈరోజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉత్తర కోస్తా జిల్లాల పరిధిలో వరి, చెరుకు, మొక్కజొన్న వంటి పంటలు అధికంగా పండిస్తున్నారని వీటికి గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నూతన సాంకేతిక పద్ధతుల ద్వారా పంటల ఉత్పాదకతను పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వానికి సిఫార్సులు చేస్తామని ఆయన వెల్లడించారు.

====================

భూముల రీసర్వే పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. జిల్లాలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈరోజు కలెక్టరేట్ లో రీసర్వే పురోగతి, మ్యుటేషన్ల పెండింగ్ అంశాలపై సమీక్షించారు. వెరిఫికేషన్ ప్రక్రియలో ఎటువంటి తప్పులు జరగడానికి వీలు లేదని, ఒకవేళ ఏవైనా పొరపాట్లు జరిగితే, దానికి సంబంధిత అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అధికారులకు వెరిఫికేషన్ ప్రక్రియపై ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. పనిలో నిర్లక్ష్యం వహించి వెరిఫికేషన్ లో తప్పులు చేస్తే ఉపేక్షించేది లేదని, నిబంధనల ప్రకారం కఠినంగా వ్యవహరించడం జరుగుతుందన్నారు. మూడవ విడత రీసర్వే పూర్తి చేసి, తుది ROR వచ్చిన పిదపే 4వ విడత రీసర్వే పనులు చేపట్టాలని ఆదేశించారు. వీఆర్ఓ లాగిన్ పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి రికార్డులకు, ఆన్‌లైన్ డేటాకు మధ్య వ్యత్యాసం లేకుండా చూడాలన్నారు.

====================

‘జలధార - జల హారతి’ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కోరారు. ‘జలధార - జల హారతి’ కార్యక్రమం కింద డోన్ మండలం ఉంగరానిగుండ్ల గ్రామంలో చేపట్టిన ఎద్దుపెంట వాటర్‌షెడ్ ప్రాజెక్టును కలెక్టర్ ఈరోజు పరిశీలించారు.

=====================
=====================